క్లుప్తంగా

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

మిర్యాలగూడ : రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం దామరచర్ల మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ ఆరోపించారు. శనివారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. వేసవికాలంలో రైతులు విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం ఇప్పటివరకు బోనస్ అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రైతులకు బోనస్, సరిపడా యూరియా అందించి ఆదుకోవాలన్నారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో రైతులను పెద్దఎత్తున సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దయానంద్, పాపానాయక్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, ఖాజా మోహిద్దీన్, సుబాని, చంద్రకళ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు శ్రీనును సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అలుగోముల శ్రీనివాస్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాడు. శనివారం మిర్యాలగూడలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు శ్రీనును నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఎర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట్ల సుధాకర్, బోడ్డుపల్లి అశోక్, ఉప్పల రమేష్ తదితరులున్నారు.

భవన నిర్మాణ నిధికి విరాళం అందజేత



భవన నిర్మాణ నిధికి విరాళం అందిస్తున్న మణెమ్మ

దేవరకొండ : పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ నిధికి రిటైర్డ్ ఉద్యోగస్తురాలు ఎం.మణెమ్మ శనివారం రూ.10వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. భవన నిర్మాణ నిధికి రిటైర్డ్ ఉద్యోగులు అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు. ప్రస్తుతం మొదటి అంతస్తు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి నరసింహ, పంగునూరి లింగయ్య, దామోదర్‌రెడ్డి, ఐజాక్, యూ సుఫ్‌షరీఫ్, పాండరయ్య, తదితరులున్నారు.

నారయ్య మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డిండి : మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు వొడ్డెమాను నారయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మండలంలోని ఖానాపూర్‌లో నారయ్య మృతదేహంపై ఎర్రజెండాను కప్పి పూల మాలలు వేసి వారు నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి వెంట ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహ్మారెడ్డి, తూం బుచ్చిరెడ్డి, వెంకటరమణ, మైనోద్దిన్, కనకాచారి, విజయేందర్‌రెడ్డి, శైలేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలపై జీఎస్టీ పన్ను తగ్గించిన ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు శనివారం నల్లగొండలోని నేతాజీ విగ్రహం వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ ,బండారు ప్రసాద్, పోతెపాక లింగస్వామి, పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ శోభాయాత్ర



డిండి: ప్రాజెక్టులో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



కొండమల్లేపల్లి : గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ సత్యం



త్రిపురారంలో గణపతి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



అలీనగర్ వద్ద ఎడమ కాల్వలో గణేష్ నిమజ్జనం



కొండమల్లేపల్లిలో

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, తదితరులు

మిర్యాలగూడ : ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని, వారు అందించిన విద్యతోనే అన్ని రంగాల్లో రాణిస్తారని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో చార్టెడ్ అకౌంటెంట్ వజ్రపు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూజోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజానికి దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. ప్రతి విద్యార్థికి కల్మశం లేకుండా విద్యను అందించి తమ శిష్య బృందం ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించే ఉద్యోగి ఉపాధ్యాయుడేనని ఆయన కొనియాడారు. అనంతరం 15 మంది ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు, మాజీ కౌన్సిలర్లు ఖాదర్, జానీ, ప్రమీల తదితరులు ఉన్నారు.

ముస్లిం, మైనార్టీల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

మిర్యాలగూడ టౌన్ : ముస్లిం మైనార్టీల సంక్షేమం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధ లేకపోవడం దురదృష్టకరమని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎంఏ రహమాన్ ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ అమెంట్‌మెంట్ యాక్ట్ -2025 ప్రకారం జీఓ 76ను తక్షణమే రద్దు చేయాలన్నారు. వక్ఫ్‌బోర్డు సీఈఓను అన్యమతస్తులకు కట్టబెట్టే ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను జెండాలను మోసే కార్యకర్తలుగానే చూస్తూ ఓటు బ్యాంకును పెంచుకుంటుందని ఆరోపించారు. జీఓ 76ను రద్దు చేయకుంటే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

డ్రాఫ్ట్ ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



అడవిదేవులపల్లిలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ రమేష్

మిర్యాలగూడ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఫొటో ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం ఎంపీడీఓ శేషగిరిశర్మ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడ మండలంలో మొత్తం 19 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి 55,180 మంది ఓటర్లు, 99 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈనెల 8న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు సకాలంలో హాజరై అభ్యంతరాలు, సూచనలు అందించాలన్నారు. తుది జాబితాను ఈనెల 10న ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలుంటే తెలపండి

అడవిదేవులపల్లి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా అడవిదేవులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాతంగి రమేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబితాలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదీలోగా కార్యాలయంలో తెలియజేయాలన్నారు. మండలంలో మొత్తం ఐదు ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి మొత్తం 14, 674 ఓటర్లు ఉన్నారని, 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.

ఓటరు జాబితా నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

త్రిపురారం : ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటరు జాబితా నిర్వహణ పారదర్శకంగా ఉండే విధంగా అధికారులు పకడ్బందీగా పనిచేయాలని తీసుకోవాలని జెడ్పీ సీఈఓ శ్రీనివాస రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాలను అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఓటరు జాబితాలకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల సలహాలు, సూచనలు సైతం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో వసతులను కూడా పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, ఎంపీఓ బత్తుల వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, జూనియర్ అసిస్టెంట్ మహేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబితాలపై అభ్యంతరాలుంటే తెలపాలి

వేములపల్లి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదీలోపు తెలియజేయాలని ఎంపీడీఓ జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలంలోని 38 పోలింగ్ స్టేషన్ పరిధిలో 20,568 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 9966 మంది పురుషులు, 10602 మంది స్త్రీలు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : బీఆర్ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ ఇరవై నెలల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గర్కనటతండాలో ఎమ్మెల్సీ సీడీపీ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీని గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అల్లి పెద్దిరాజు, రమణరాజు, భిక్షా నాయక్, శంకర్ నాయక్, హనుమానాయక్, బాలు, రంగసాయి, కిషోర్, సతీష్‌రెడ్డి, హరిసింగ్, రంగా, బాలు, రవీంద్రచారి, లాలు, దేవు, పుల్లంరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన ఏఐటీయూసీ పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

దేవరకొండ : కార్మికుల పక్షాన ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఫర్టిలైజర్ దుకాణ యజమానులు, ఏఐటీయూసీ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలని కోరడంతో దుకాణ యజమానులు ఇందుకు సాను కూలంగా స్పందించి రేట్లు పెంచినట్లు వారు తెలిపారు. రెండేళ్లకొకసారి నిర్వహించే అగ్రిమెంట్‌లో గతంలో ఉన్న రేట్లపై 15శాతం అదనంగా పెంచినట్లు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం రాజీలేని సమరశీల పోరాటాలను సీఐటీయూ నిర్వహిస్తుందని వారు గుర్తు చేశారు. ఈ సమావేశంలో వెంకట్రాములు, పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

మాడుగులపల్లి : మాడుగులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన అండర్‌- 14, 17 విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించినట్లు ఎంఈఓ వెంకటమ్మ తెలిపారు. శనివారం విజేతలకు ఆమె బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. క్రీడల్లో రాణించి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ కస్తూరి రవీందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి

దేవరకొండ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, సీనియర్ నాయకులు నక్క వెంకటేష్‌యాదవ్ అన్నారు.సామాన్య ప్రజలపై జీఎస్టీ భారాన్ని కేంద్ర ఆర్థికశాఖ తగ్గించడాన్ని హర్షిస్తూ శనివారం పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సామాన్య ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకుంటూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నేతాళ్ల వెంకటేష్, ఇడెం రవి, సహదేవుడు, నాగేంద్ర, బిక్కు, హరి, భాస్కర్, శంకరయ్య, సుమన్, గోపి, సైదులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు కన్నీటి వీడ్కోలు



భాస్కర్ అంతిమ యాత్రలో పాల్గొన్న జర్నలిస్టులు, మాజీ ఎమ్మెల్యేలు



మిర్యాలగూడ టౌన్ : ఈదులగూడెంలో భాస్కర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడకు చెందిన సీనియర్ జర్నలిస్టు దండ భాస్కర్ (52) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం అందరిలో కలివిడిగా ఉండే భాస్కర్‌ను కడసారిగా చూసేందుకు భారీ ఎత్తున స్నేహితులు, బంధువులు, జర్నలిస్టులు తరలివచ్చి చివరి సారిగా కన్నీటి వీడ్కోలు పలికారు. మృతుడికి భార్య సునంద, ఇద్దరు కుమార్తెలు సహాస్రా, సాద్వికలున్నారు. అయితే తండ్రికి పెద్ద కుమార్తె సహాస్ర తలకొరివి పెట్టింది. అయితే తాను మరణించిన మరొకరికి చూపు కల్పించాలనే లక్ష్యంతో జర్నలిస్టు దండ భాస్కర్ తన నేత్రాలను డైమాండ్ నేత్రనిధికి దానం చేశారు. మరణించిన తరువాత మాశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. అలాగే ఆయన మృతికి నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి ఫోనులో సంతాపం ప్రకటించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భాస్కర్ కుటుంబానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.50వేలు, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, శ్రీధర్ రూ. 10 వేలు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యడవల్లి శ్రీనివాస్‌రెడ్డి, దామరచర్ల మాజీ జెడ్పీటీసీ భర్త హతిరాంనాయక్ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. బీఎస్పీ నేత డాక్టర్ జాడీ రాజు, తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, డాక్టర్ ముప్ప రామారావు, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కస్తూరి ప్రభాకర్, విద్యావంతుల వేదిక నేత అంబటి నాగయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులుడ డబ్బికార్ మల్లేష్, సీపీఐ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, ఓయూ జేఏసీ అధ్యక్షులు మంద వినోద్, వివిధ పార్టీల నాయకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అభిరాం

పెద్దవూర : మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇ ఇసురాజు అభిరామ్‌యాదవ్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాయకరావుపేటలో నిర్వహించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి సీబీఎస్ఈ జూనియర్ క్లస్టర్‌లో బాస్కెట్‌బాల్ పోటీల్లో అభిరాం యాదవ్ ఉత్తమ ప్రతిభ కనపర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో అక్టోబర్ 5 నుంచి 15వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాజ్ నందిగాన్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. 2024లోనూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వరుసగా రెండు పర్యాయాలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం గమనార్హం. మారుమూల గ్రామానికి చెందిన ఇసురాజు అభిరాంయాదవ్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక అవవ్వడంపై తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు-సువర్ణ దంపతులతో పాటు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

త్రిపురారం : విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ మాలోతు సంజయ్ అన్నారు. శనివారం త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని రాజీవ్ కాలనీలోని ఎస్టీ మినీ గురుకులంలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడారు. విద్యార్థులు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతి గోర్లల్లో మట్టి లేకుండా ఎప్పటికప్పుడు గోర్లను కత్తిరించుకోవాలన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యుల సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలజ, ప్రధానోపాధ్యాయులు భారతి, హెల్త్ సూపర్‌వైజర్ కమలమ్మ, ఏఎన్ఎంలు కృష్ణకుమారి, లీలా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంటలోనే యూరియా పంపిణీ పూర్తి



యూరియా కూపన్ల కోసం బారులుదీరిన రైతులు

నిడమనూరు : యూరియాకోసం రైతులు రోజుల తరబడి... సహకార సంఘం చుట్టూ తిరగాల్సి వస్తోంది. మూడు రోజులక్రితం(ఈనెల 4న) నగుదు చెల్లించి, రశీదు పొందిన వారికి శనివారం యూరియా పంపిణీ చేశారు. కూపన్ కోసం ఒకరోజు, రెండో రోజు వేలిముద్ర రశీదు కోసం క్యూలైనులో బారులు తీరితే... తేదీల వారీగా యూరియా అందిస్తున్నారు. ఈనెల 4న రశీదు పొందిన వారికి కొంతమందికే యూరియా అందింది. 450 మంది వరకు రశీదులు పొందితే, శనివారం సహకార సంఘానికి ఒక లారీ 20 టన్నులు(444 బస్తాలు) రాగా, 222 మంది రైతులకు, ఒక్కొక్కరికీ రెండు బస్తాల చొప్పున 222 మంది రైతులకు ఒక గంటలోనే అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి

కట్టంగూర్ : మండలంలోని చెరువుఅన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి అవకాశం కల్పించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు గద్దపాటి సుధాకర్ మాట్లాడుతూ చెరువుఅన్నారం గ్రామానికి మొదటి విడతలో 20ఇళ్లు మంజూరు కాగా 9మంది కట్టుకోవడానికి సిద్ధంగా లేరని తెలిపారు. వారి స్థానంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంట మల్లేశ్ తదితరులున్నారు.

లక్కీ డ్రాలో బంగారు గణపతి ప్రతిమ



బంగారు గణపతి ప్రతిమను లక్కీ డ్రాలో అందుకున్న గురివిరెడ్డి - మాధవి దంపతులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రెడ్డికాలనీలో నవయుగ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద భారీ గణనాథుడితో పాటు రూ.1,15,000 విలువ గల చిన్న వినాయక బంగారు ప్రతిమను ఉంచి తొమ్మిది రోజుల పాటు పూజలు చేశారు. అయితే లడ్డూను, బంగారు గణపతి ప్రతిమను లక్కీ డ్రా ద్వారా భక్తులకు ఇవ్వాలని నిర్ణయించి లడ్డూకు రూ.116, బంగారు ప్రతిమకు రూ.516 టోకెన్ ధర నిర్ణయించారు. దీంతో లడ్డూకు 422 మంది, బంగారు గణపతి ప్రతిమకు 478 మంది డ్రాలో భాగస్వాములు కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడపకు చెందిన పోలు గురివిరెడ్డి- మాధవి దంపతులకు లక్కీ డ్రాలో బంగారు గణపతి ప్రతిమ దక్కింది. వినాయకుడి లడ్డూ పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన పార్వతమ్మకు దక్కింది. అనంతరం విఘ్నేశ్వరుడి శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు చిట్టిపోలు మట్టపల్లి, సభ్యులు రఘు వంశీ, సాయిరాం, కృష్ణకాంత్, శేఖర్, సాయికుమార్, ఈశ్వర్, గణేష్, కృష్ణమోహన్, నాగేందర్, అనిత, అనూష ఉన్నారు.

రూ.1.30 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



పెద్దవూరలో లడ్డూను దక్కించుకున్న బొడ్డు శంకర్

పెద్దవూర : మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీలో నవరాత్రులు పూజలు అందుకున్న గణేష్ లడ్డూ వేలంలో రూ.1.30 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్ వేలంలో లడ్డూను దక్కించుకున్నాడు. రంగప్పకాలనీ, దర్గాకాలనీ, హనుమాన్ కాలనీలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను కోలాటాలు, నృత్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

రూ.1,16,000 పలికిన గణనాథుడి లడ్డూ

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి గ్రామంలోగణనాథుడి మండపం వద్ద శనివారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామ మాజీ సర్పంచ్ లోకసాని కృష్ణయ్య రూ.1,16,000 లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నాడు. అలాగే చిన్న లడ్డూను మెరుగు పెద్దయ్య రూ.30వేలకు దక్కించుకున్నాడు. అనంతరం గణనాథుడిని నిమజ్జనం చేశారు.

హాలియాలో రూ.1,07,516

హాలియా : అనుములవారిగూడెంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు గణపతి లడ్డూ వేలం నిర్వహించగా రావుల రామలింగయ్య రూ. 107516కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు రావుల రామలింగయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.